క్లుప్తంగా

బియ్యం షాపుల్లో తనిఖీలు



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

హుజూరాబాద్: పట్టణంలోని పలు బియ్యం దుకాణాల్లో తూనికలు కొలతల శాఖాధికారులు సోమవారం తనిఖీలు చేశారు. తూకం సరిగ్గా లేని రెండు బియ్యం దుకాణాలపై కేసులు నమోదు చేశామని శాఖాధికారులు విజయసారథి, భూలక్ష్మీ తెలిపారు. నిబంధనలు పాటించకుంటే షాపుల యాజమానులపై శాకాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ఈటల'పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న సంపత్

హుజూరాబాద్: బీజేపీ మేడ్చల్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్, హ్యూమన్ రైట్స్, డీజీలకు ఫిర్యాదు చేసినట్లు ఈటల దళిత బాధితుల సంఘం అధ్యక్షుడు తిప్పారపు సంపత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈటల అరాచకాలపై మాట్లాడకుండా ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఈటల అనుచరులు, బీజేపీ నాయకులు దాడులకు పాల్పడ్డారని, ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పేర్కొన్నారు.

నవోదయకు ఎంపిక



కౌశిక్‌ను అభినందిస్తున్న జ్ఞానిక, శ్రీనివాస్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన శ్రీనివాస్,అర్చన కుమారుడు కౌశిక్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. సాయివిద్యా మందిర్‌లో ఐదో తరగతిచదువుతుండగా మండలం నుంచి ఒక్కడే ఎంపికకావడంతో కౌశిక్‌ను స్కూల్ కరస్పాండెంట్ జ్ఞానిక, హెచ్‌ఎం శ్రీనివాస్ సోమవారం అభినందించారు.

నీటి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్యల పరిష్కారానికి కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని సోమవారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ప్రకటనలో తెలిపారు. జక్కె రాజేశ్ , డి. శ్రీనివాస్, మోటపోతుల వినయ్ కంట్రోల్ రూంలో అందుబాటులో ఉంటారని, ప్రజలు 7382100526, 9885664474, 6301328484 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో సకల సౌకర్యాలు ఉన్నప్పటికీ విధుల్లో వైద్యులు నిర్లక్ష్యం చేస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ లోపంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీ సోమవారం ఆరోపించారు. రోగులకు అందుబాటులో ఉండేందుకు స్టాఫ్ క్వార్టర్స్ అందుబాటులో ఉన్నా వైద్యులు ఉండేందుకు ఇష్ట పడడంలేదన్నారు. ఆసుపత్రిలో మార్చురీ నిర్వహణ సరిగా లేదని, ఆసుపత్రికి వెచ్చించాల్సిన నిధులలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. అధికారులు విచారణ జరిపి, రోగులకు సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రోగుల సమస్యల పరిష్కారం కోసం దీక్షలు చేపట్టి ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

జమ్మికుంట: ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. టౌన్ సీఐ వరగంటి రవి తెలిపిన వివరాలు మండలంలోని గండ్రపల్లి గ్రామానికి చెందిన పార్వతి సాగర్ (23) ఈ నెల 1న పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి, చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడు పలు వ్యాపారాల కోసం చేసి అప్పులు చేశాడని ఏవిధంగా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగాడని, తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఉన్నా.. లేనట్టే!

- పనిచేయని సీసీ కెమెరాలు
- నిర్వహణ లోపం, నిర్లక్ష్యం
- మరుగునపడుతున్న నిజాలు

శంకరపట్నం: ప్రజల భాగస్వామ్యంతో మండలంలోని కేశవపట్నంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు పక్కనున్న వ్యాపారుల నుంచి పోలీస్ అధికారులు, ఓ మాజీ ప్రజాప్రతినిధి పెద్దమొత్తంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామని డబ్బులు వసూలు చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటైతే చేశారు కానీ నిర్వహణ, మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా పోలీస్ అధికారులు పట్టించుకోలేదు. రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో చింతగుంట గ్రామానికి చెందిన సిరిసిల్ల ఆంజనేయులు మృతిచెందిన విషయం తెలిసిందే. బస్సు ఢీకొని మృతి చెందాడా లేదా మరేదైనా కారణమా అనే విషయం తెలుసుకోవడానికి ఆర్టీసీ విజిలెన్స్ అధికారి వచ్చి మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. అప్పుడు బస్టాండ్ సమీపంలోని సీసీ కెమెరాలు పనిచేయడం లేదనే విషయం వెలుగులోకి వచ్చింది. మెయిన్‌రోడ్డు పక్కన బిగించిన సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో నాణ్యత లేని కెమెరాలు బిగించారని మండలంలోని పలువురు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. 2017 సంవత్సరానికి ముందు అప్పటి పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి ఆదేశానుసారం ఎస్సై ఎల్. శ్రీను మండల కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సీపీతో ప్రారంభింపజేశారు. దొంగతనాలు, ప్రమాదాలు జరిగినప్పుడు పలు విషయాలను తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని మండల వ్యాప్తంగా ప్రచారం చేసి కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పలు భిన్నమైన కేసులను సీసీ కెమెరాలతో ఛేదించిన సంఘటన లున్నాయి. కాగా అప్పుడు నాణ్యమైన సీసీ కెమెరాలు బిగించడంతో చట్టవ్యతిరేక కార్యక్రమాలను, ఇతరర విషయాలను గుర్తించడం సులువైంది. ప్రస్తుతం నాణ్యమైన కెమెరాలు లేకపోవడంతో నిందితులను గుర్తించడం అధికారులకు ఇబ్బందిగా తయారైంది. దొంగతనాలు, ప్రమాదాలను పసిగట్టే సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిజాలు మరుగున పడిపోయి పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. మండలంలో ఇటీవల ఓ బైక్ చోరీకి గురైంది, ఆటోమొబైల్ షాపులో భారీ ఎత్తున సామాను చోరీకి చేశారు. సీసీ కెమెరాలు పనిచేయనందున ఇప్పటివరకు నిందుతులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. ఇప్పటికైనా అధికారులు నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు నిర్వహణ, మరమ్మతులపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



గంగాధర: మాట్లాడుతున్న ఎంపీడీవో రాము



గన్నేరువరంలో..

గంగాధర: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో దమ్మని రాము మాట్లాడుతూ... పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలు వేశామన్నారు. కమిటీల ద్వారానే పాఠశాలలోని సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం జరుగుతుందన్నారు. తాగునీటి సదుపాయం, మూత్రశాలల మరమ్మతులకు ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు వేయించనున్నామని, పాఠశాల కమిటీల్లో హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్‌గా, మహిళాసంఘం అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా, ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు మెంబర్లుగా ఉంటారని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సమావేశంలో మండల విద్యాధికారి వేణుకుమార్, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి, ఎఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: గన్నేరువరంలోని రైతువేదికలో ఎంపీడీవో శంకర్ అధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో నర్సింహారెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం లావణ్య, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వీణవంక: కమిటీలు ప్రభుత్వ నియమాలు పాటించి పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎంపీడీవో అన్నారు. ఎంఈవో విడపు శ్రీనివాస్, ఎంపీవో కొంరయ్య, వీవోలు పాల్గొన్నారు.

జమ్మికుంట: కమిటీలు, ప్రభుత్వ నియమాలు పాటించి పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంపీడీవో భీమేశ్, ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో సమావేశం నిర్వహించారు.

చొప్పదండి: మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎంఈవో వేణుకుమార్, ఏఈ విజయ సారథి, ఏపీఎం నర్మద, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



హుజూరాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంత విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కిట్స్ కళాశాల సెక్రెటరీ, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డైరెక్టర్ కె. శంకర్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ మరో మూడేళ్లకు పొడిగించినందుకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా 1997లో కిట్స్ కళాశాల స్థాపించామని, 2021లో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్, ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ విభాగాలకు చెందిందని, 2023లో న్యాక్ గుర్తింపు పొందిందన్నారు. గతేడాది యూజీసీ ద్వారా అటానమస్ హోదా పొందిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కళాశాల డైరెక్టర్ కె.ఈశ్వరయ్య మాట్లాడుతూ... కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయని, సంపూర్ణంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

నియామకం



అప్సర్

హుజూరాబాద్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ విభాగం ఎలక్షన్ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన అప్సర్‌ను నియమిస్తూ ఏఐసీసీ మైనార్టీ తెలంగాణ ఇన్‌చార్జి పర్వాన్ అజ్మీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు అప్సర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న రాంచంద్రం మాదిగ

హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగలు బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రుద్రారపు రాంచంద్రం మాదిగ అన్నారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో మూడు ఎస్సీ రిజర్వుడు ఎంపీ స్థానాలున్నాయని, అలాగే కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎస్సీ రిజర్వుడు కాగా ఉప ఎన్నిక సందర్భంగా మాదిగలకు టికెట్ కేటాయించక కాంగ్రెస్ ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శించిందన్నారు. మాదిగలకు ఒక్కసీటు కూడా కేటాయించకుండా సామాజిక న్యాయానికి పాతర వేసిందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగలు కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకొని ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మారెపల్లి శ్రీనివాస్, అంబాల మదునయ్య, కలవల మల్లయ్య, మొలుగూరి ప్రభాకర్, మేకల యాదగిరి, తుంగ ఆంజనేయులు, గాజుల సతీశ్ పాల్గొన్నారు.

సిరిసిల్ల దీక్షను విజయవంతం చేయండి

చొప్పదండి: సిరిసిల్లలో నేతన్నలకు అండగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నిర్వహించే దీక్షను బీజేపీ నాయకులు, నేతన్నలు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ కోరారు. 10 వ తేదీన ఉదయం పది గంటల నుంచి దీక్ష కొనసాగుతుందని, బతుకమ్మ చీరల బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్మికులకు ఇవ్వాల్సిన పదిశాతం ఎర్న్ సబ్సిడీ, విద్యుత్ బిల్లుల్లో యాభై శాతం సబ్సిడీ చెల్లించాలని, వర్క్ టు ఓనర్ పథకం పునరుద్ధరించాలని కోరుతామని తెలిపారు.

తైవాన్‌లో ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల్లో హుజూరాబాద్, సైదాపూర్ మండల వాసులు

హుజూరాబాద్‌రూరల్: ఉద్యోగరీత్యా తైవాన్‌లో స్థిరపడిన హుజూరాబాద్, సైదాపూర్ మండలాలకు చెందిన పలువురు సోమవారం తైవాన్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి, నోరూరించే వంటకాలను వండుకొని ఆరగించారు. కార్యక్రమంలో ఇండియా తైవాన్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ సౌమిత్‌రాజు, రోహిత్, అధ్యక్షులు మనోజ్, శ్రీరామోజు, ఉపాధ్యక్షులు శైలజ, రామకృష్ణ, కిశోర్, ప్రధాన కార్యదర్శి సత్యం, ముఖేశ్, చందు, కోశాధికారి ఏడుకొండలు, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లోనే కూరగాయలు విక్రయించాలి

శంకరపట్నం: కేశవపట్నం మార్కెట్‌లోనే కూరగాయలు, దుస్తులు, పండ్లు విక్రయించాలని ఎంపీడీఓ శ్రీవాణి సూచించారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను సోమవారం పరిశీలించారు. రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తుండటంతో ప్రయాణికులకు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా 50ఫీట్ల దూరంలో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. ఈకార్యక్రమంలో సెక్రెటరీ నర్సయ్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రుణాలు



రుణాలు అందిస్తున్న మేనేజర్

మానకొండూర్: మండలంలోని కొండపల్కలలో ఎస్ఆర్‌కె డెయిరీ జమ్మికుంట ఆధ్వర్యంలో సోమవారం రైతులకు రుణాలు అందించారు. ఈసందర్భంగా చైర్మన్ బండారి మారుతి, డైరెక్టర్ కృష్ణారావు ఆదేశాల మేరకు అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జనరల్ మేనేజర్ ఎం. మధుసూదన్‌రావు సూచించారు. ఈ కార్యక్రమంలో చిల్లింగ్ సెంటర్ మేనేజర్ ఇ.విష్ణువర్ధన్‌రెడ్డి, టి.సంతోష్, దామోదర్‌రెడ్డి, రమేశ్, పాడిరైతులు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే జయంతి కమిటీ



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక

హుజూరాబాద్: మహాత్మాజ్యోతిరావు పూలే నూతన జయంతి కమిటీ సభ్యులను గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో జయంతి కమిటీ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజ్‌కుమార్, అంబేడ్కర్ జయంతి కమిటీ అధ్యక్షుడు ఖాలీద్ హుస్సేన్, సభ్యులు తులసి లక్ష్మణమూర్తి, ఇప్పలపల్లి చంద్రశేఖర్, జమదగ్ని మల్లేశ్ ఉన్నారు.

ఒలింపియాడ్‌లో సత్తా చాటిన విద్యార్థులు



బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

హుజూరాబాద్: జాతీయ స్థాయిలో నిర్వహించిన టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో పట్టణంలోని శ్రీకాకతీయ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ మాట్ల సందీప్‌కుమార్ సోమవారం తెలిపారు. 315 మంది ఒలింపియాడ్ పరీక్ష రాయగా 271 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతులు పొందారని వివరించారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పచ్చిమట్ల అనన్య, గూడూరి ఆశిశ్‌రెడ్డి, పిపాస మండల్, బొక్కల నవనీత్‌రెడ్డి ఐదో స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్, బహుమతులు, సర్టిఫికెట్లు సాధించారు. మిగతా విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు సాధించారని సత్తా చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్, యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం ముద్రకోల రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ మంద శ్రీనివాస్, ప్రైమరీ ఇన్‌చార్జి తిరుమల, ఒలింపియాడ్ ఇన్‌చార్జీలు రజనీకాంత్, చామంతి, తదితరులు పాల్గొన్నారు.

మండల సభ వాయిదా

జమ్మికుంట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీవో భీమేశ్ తెలిపారు. సభకు సభ్యుల హాజరుకాలేదని, కోరం లేనందున సర్వసభ్య సమావేశం వాయిదా వేశామని ప్రకటించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఓ వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. సైదాపూర్ మండలం రామచంద్రాపూర్‌కు చెందిన గుల్లరాజు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.11,70,000 తీసుకున్నాడని పలుమార్లు అడిగినా సమాధానం చెప్పకుండా తప్పించుకుంటూ తిరుతున్నాడని పట్టణంలోని కృష్ణాకాలనీకి చెందినమైస రమేశ్ వాపోయాడు. డబ్బులు ఇవ్వాలని అగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని, రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లికి చెందిన గంట సింధూజ, విజయ్, వర్ష అనే విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సోమవారం రాత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ నరేందర్

కరీంనగర్‌క్రైం: ఆటోడ్రైవర్లు నియమనిబంధనలు పాటించాలని కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ అన్నారు. సోమవారం కమిషనరేట్ కేంద్రంలోని జాన్‌విల్సన్ మెమోరియల్‌హాల్‌లో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆటోనంబర్‌తో పాటు పోలీసులు జారీ చేసే టాప్ నంబర్‌ను కలిగి ఉండాలని సూచించారు. ఆటో యజమానులు వారి ఆటోలను నేరచరిత్ర గల డ్రైవర్లకు ఇవ్వకూడదన్నారు. ఉల్లంఘించి పట్టుపడితే డ్రైవర్‌తో పాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎక్కువ రద్దీ ఉండే ప్రదేశాల్లో ప్రయాణికులు, వాహనదారులకు అంతరాయం కలిగేలా రోడ్డుపై ఆటోలు నిలుపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఖరీముల్లాఖాన్ , రమేశ్, వన్ టౌన్ సీఐ సరిలాల్, ఆటో డ్రైవర్లు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి



జమ్మికుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన నకిలీ విత్తనాలను పట్టణంలో విక్రయిస్తున్నారని, వాటిని అరికట్టాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాములు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బీటీ 3 విత్తనాల అమ్మకాలు సాగిస్తున్నరని, వీటితో రైతులు నష్టపోయే పరిస్థితులున్నాయని అన్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

యుతిపై లైంగిక దాడికి యత్నం

హుజూరాబాద్‌రూరల్: స్నేహం పేరుతో యువతిని నమ్మించి అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. సైదాపూర్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన ఓ యువతిని తుమ్మన్నపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు వేములవాడకు తీసుకెళ్లి మాయమాటలు చెప్పి భయభ్రాంతులకు గురిచేసి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని, అనంతరం పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువకుడు సొంత గ్రామం తుమ్మన్నపల్లికి తీసుకొచ్చాడని, సంఘటనపై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

బావిలో యువకుడి గల్లంతు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగులకు చెందిన ఓ యువకుడు వ్యవసాయబావిలో గల్లంతయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మాదం విజయ్(22) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఉగాది పురస్కరించుకొని స్వగ్రామం వచ్చాడు. సోమవారం స్నేహితులతో కలిసి ఊరకుంట వద్ద వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత కొట్టి స్నేహితులందరూ బయటకు వచ్చారు. విజయ్ రాకపోవడంతో వెంటనే అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్లు వచ్చి, వెతికినా ఫలితం లేకపోయింది.

సాయం చేసి ప్రాణం కాపాడండి

ఫోన్ పే, గూగుల్ పే నంబర్
96762 56354

రామడుగు: భార్య వైద్యం కోసం డబ్బులు లేక దాతలసాయం కోసం భర్త అర్థిస్తున్నాడు. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ముమ్మడి రమ కొద్ది రోజులుగా పేగు క్యాన్సర్‌తో బాధపడుతోంది. వైద్యానికి డబ్బులు లేకపోవడంతో మంచానికే పరిమితమైంది. తన భార్య ప్రాణాలు కాపాడటానికి దాతలు సహాయం చేయాలని భర్త ముమ్మడి భాస్కర్ వేడుకుంటున్నాడని, దాతలు 9676256354 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆర్థికసాయం చేయాలని శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ గోపాల్‌రావుపేట సభ్యులు కోరారు.



సాయం చేయాలని వేడుకుంటున్న భాస్కర్

పగలే వెలుగు

సైదాపూర్: మండలంలోని రాంచంద్రాపూర్‌లో వీధి లైట్లు 24 గంటలు వెలుగుతూనే ఉన్నాయి. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పగలు కూడా వీధిలైట్లు వెలుగుతున్నాయని, బంద్ చేసే సమయం లేదా అంటూ పంచాయతీ సిబ్బందిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, అధికారులు గ్రామ సమస్యలు పట్టించుకోవడంలేదని, సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

